


నిజాంసాగర్ నీటిని పొదుపుగా వాడుకోవాలి

● బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

వర్ని, జూలై 9: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఈ వానాకాలం సీజన్‌లో నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవని రైతులు పంట చేతికి వచ్చే వరకు నీటిని పొదుపుగా వాడుకుని సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కోరారు. వర్ని మండల కేంద్రంలో మంగళవారం వర్ని, చందూర్, మోస్రా, రుద్రూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సీఎం రేవంత్ రెడ్డి తన ఇంటికి రాగా మొదట నిజాంసాగర్ ప్రాజెక్టు పరిస్థితిని సీఎంకు విన్నవించగా ఆయన వెంటనే స్పందించి మరుసటి రోజే నీటి విడుదలకు ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. రాజకీయం అంటే ఒక పవిత్రమైన పదవి అని అదే పట్టుదలతో యువ నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకువెళ్తానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కలుపుకుని విభేదాలకు తావు లేకుండా అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ బాబా, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులవైపు.. రైతుల చూపు

- జిల్లాలో కానరాని భారీ వర్షాలు
- వరిసాగును మొదలు పెట్టిన రైతులు
- సాగునీటి కోసం తప్పని ఎదురు చూపులు
- ప్రాజెక్టుల నీటిని విడుదల చేయాలని రైతుల ఒత్తిడి
- నిజాంసాగర్ నీటిని విడుదల చేయడంతో పాత ఆయకట్టుకు మొత్తం ఇవ్వాలంటున్న రైతులు



నిజామాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని రైతులు ప్రాజెక్టులవైపు చూస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో రైతులు ప్రాజెక్టుల నీటి కోసం అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నీటిని అందించాలని కోరుతున్నారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను కలుస్తూ పంటలు వేసేందుకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిజాంసాగర్ నీటిని విడుదల చేయడంతో అలిసాగర్ కింద కూడా అందించాలని రైతులు కోరుతున్నారు. భారీ వర్షాలు పడకపోవడం వల్ల బోర్లలో సరిపడా భూగర్భ జలాలు లేకపోవడంతో వరినాట్లు వేస్తున్న రైతులు నీటి కోసం ఒత్తిడి పెంచుతున్నారు. రెండు ప్రధాన ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో అధికారులు కూడా ఎక్కువ మొత్తంలో నీటిని విడుదల చేసేందుకు మొగ్గు చూపడం లేదు. నిజాంసాగర్‌లో ఉన్న నీటి నిల్వలు మరో రెండు తడులకు మాత్రమే వచ్చే అవకాశం ఉండటంతో సింగూరు నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. భారీ వర్షాలు పడితే నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. రైతులు ఉన్న నీటితోనే ప్రస్తుతం నాట్లను వేస్తున్నారు. ఈ నెలలో కూడా సరిపడా వర్షాలు కురవకుంటే వరిసాగు కూడా తగ్గే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

జిల్లాలో మోస్తరు వర్షాలు..

జిల్లాలో ఇప్పటి వరకు భారీ వర్షాలు పడలేదు. నైరుతి రుతుపవనాల వల్ల జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు పడుతున్నా.. వాగులు పొంగి చెరువులు నిండే విధంగా వర్షం పడలేదు. ఇప్పటి వరకు చెరువులు, కుంటల్లో ఎక్కువ మొత్తంలో నీళ్లు రాలేదు. జిల్లాలో జూన్1 నుంచి ఇప్పటి వరకు భారీ వర్షం పడకపోవడం వల్ల తగినంతగా భూగర్భ జలాలు పెరగలేదు. జిల్లాలో సరాసరి నీటి మట్టాలు గత సంవత్సరంకంటే రెండున్నర మీటర్లు తగ్గిపోయాయి. జిల్లాలో 9 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు సరాసరి వర్షపాతం 223.2 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 212.9 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 5.3 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. వేల్పూర్ మండలంలో 41 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని 33 మండలాల్లో పూర్తిస్థాయిలో సరాసరి సగటు వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలో ఏడు మండలాల్లో సరాసరి వర్షపాతం కన్న ఎక్కువగా పడగా 14 మండలాల్లో సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 12 మండలాల్లో సగటు వర్షపాతం కంటే తక్కువగా వర్షం పడింది.

2లక్షల 50వేల ఎకరాలకు పైగా పంటల సాగు

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2లక్షల 50వేల ఎకరాలకు పైగా పంటలను వేశారు. వీటిలో లక్ష ఎకరాలకు పైగా వరిసాగును చేశారు. ఈ వానాకాలంలో ఈ సంవత్సరం 4లక్షల 30వేల ఎకరాల్లో వరిసాగు అవుతుందని అంచనా వేశారు. జిల్లాలో భారీ వర్షాలు పడకున్నా బోర్ల కింద వరిసాగును చేస్తున్నారు. భూగర్భ జలాలు తక్కువగా ఉండటం, జిల్లాలో చెరువులు, వాగుల్లో వరదనీరు చేరకపోవడం వల్ల ఎక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఉన్న నీటి నిల్వలకు అనుగుణంగా బోర్ల కింద వరిసాగును కొనసాగిస్తున్నారు. జిల్లాలో మొత్తం లక్షా 70వేలకు పైగా వ్యవసాయ బోర్లు ఉన్నాయి. జిల్లాలో చెరువులు, వాగుల్లోకి నీళ్లు వస్తే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉండటంతో రైతులు పూర్తిస్థాయిలో పంటలు వేసేందుకు నారుమల్లు వేసి ఉంచారు. వరి పంట వేసేందుకు ఆగస్టు 15 వరకు అవకాశం ఉండటం వల్ల వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

ఏటా ఆయకట్టు సాగుకు ప్రాజెక్టుల నీరు

జిల్లాలో వరిసాగు కోసం ప్రధానంగా నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి సరఫరా ప్రతిసంవత్సరం కొనసాగిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మీ కాలువ, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం, గుత్ప అలిసాగర్ ఎత్తిపోతల పథకాల ద్వారా ప్రతియేడు రెండు పంటలకు సాగునీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు ఎక్కువగా ఉన్న సమయంలోనే పంటలకు విడుదల చేస్తున్నారు. ఇవేకాకుండా వరద కాలువలకు నీటిని విడుదల చేసి నిల్వ ఉంచడం వల్ల రైతులు కొన్ని కాలువలు, మోటర్ల ద్వారా 20వేల ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నీళ్లు ఎక్కువగా లేవు. ఎత్తిపోతల పథకాలకు కూడా అందించే పరిస్థితి లేదు. ప్రాజెక్టులో 1091అడుగులకు గాను 1061.70 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను 12.208 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 20 టీఎంసీలకు పైగా ఉంటేనే ఎత్తిపోతల పథకాలకు నీటిని అందిస్తారు. నీటి నిల్వలు తక్కువగా ఉండటం వల్ల ప్రస్తుతం ఇచ్చే పరిస్థితి లేదు. ప్రాజెక్టులో కూడా వరద ఎక్కువగా రావడం లేదు. ప్రస్తుతం 3275 క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్రలోని బాబ్లీ, విష్ణుపురితో పాటు జైక్వాడ్ ప్రాజెక్టులో కూడా ఎక్కువగా నీళ్లు లేవు. భారీ వర్షాలు పడకపోవడం వల్ల ఆ ప్రాజెక్టులు నిండలేదు. వాటి నుంచి ఎక్కువగా నీళ్లు కిందికి రావడం లేదు. బాబ్లీ గేట్లు తెరిచి ఉంచినా నీళ్లు రావడం లేదు. ప్రతి సంవత్సరం ప్రాజెక్టులోకి జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలోనే ఎక్కువగా నీళ్లు వచ్చి చేరుతున్నాయి. ఈ సంవత్సరం కూడా అదే రీతిలో వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆయకట్టుకు నిజాంసాగర్ నీరు..

నిజాంసాగర్‌లో కొన్ని నీటి నిల్వలు ఉండటంతో గత నెలలో ఆయకట్టు సాగుకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పరిధిలో లక్షా 15వేల ఎకరాల వరకు సాగునీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడం వల్ల జిల్లాలోని బోధన్ డివిజన్ పరిధిలో నాట్లు వేస్తున్నారు. అలీసాగర్‌కు ఎగువ ప్రాంతంలో ఉన్న ఆయకట్టుకు సాగునీరును విడుదల చేయడం వల్ల ఈ వరినాట్లను కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు ఎక్కువగా లేవు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులకు గాను ప్రస్తుతం 1387.42 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.096 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఆయకట్టుకు నీటిని విడుదల చేసే సమయంలో ప్రాజెక్టులో 4.97 టీఎంసీల నీళ్లు ఉండేవి. ఒక తడి కోసం ఒకటిన్నర టీఎంసీల నీటిని విడుదల చేశారు. నిజాంసాగర్‌లో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు పంటలు పూర్తయ్యేంతవరకు విడుదల చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. సింగూరు ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వలు ఉండటం వల్ల ఒప్పందం ప్రకారం దిగువకు నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులతో పాటు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 523.600 అడుగులకు గాను ప్రస్తుతం 519.550 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 29.917 టీఎంసీల కు గాను ప్రస్తుతం 13.565 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఒప్పందం ప్రకారం సింగూరు నుంచి మంజీరా ద్వారా నిజాంసాగర్‌కు నీటి విడుదల చేస్తే ఆయకట్టు మొత్తానికి సాగునీరు అందుతుందని రైతులు విన్నవిస్తున్నారు. ప్రస్తుతం అలిసాగర్ వరకే నీటిని ఇస్తున్నందున న కింది ఆయకట్టుకు కూడా విడుదల చేయాలని కోరుతున్నారు. పాత ఆయకట్టు మొత్తానికి నీటిని అందిస్తే నాట్లు వేసుకునే అవకాశం ఉంటుందని రైతులు కోరుతున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి ఆధ్వర్యంలో రైతులు మూడు రోజుల క్రితం కలెక్టర్‌ను కలిశారు. నీటి విడుదలకు చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లాకు చెందిన వివిధ రైతు సంఘాల నేతలు సైతం ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్సారెస్పీలో 40 టీఎంసీల నీళ్లు వస్తేనే ఆయకట్టు సాగుకు నీటిని అందించే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితిలో తాగునీటికే వినియోగిస్తామని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు. నిజాంసాగర్‌లో నీటి నిల్వలు తగుతుండటం వల్ల ప్రస్తుతం ఉన్న ఆయకట్టుకు కూడా పూర్తిస్థాయిలో ఇచ్చే పరిస్థితి లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



వెలవెలబోతున్న నిజాంసాగర్ ప్రాజెక్టు

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?



● బురదమయంగా మారిన నూత్‌పల్లి రోడ్డు ● రాకపోకలకు తప్పని అవస్థలు

డొంకేశ్వర్, జూలై 9: మండలంలోని నూత్‌పల్లి రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. గ్రామంలోని దర్గా సమీపంలో ఉన్న కాలువ ఇరుకుగా ఉండంతో అధికారులు కాంట్రాక్టర్ ద్వారా పైపులు వేసి వెడల్పు చేయించారు. పనులు పూర్తయిన అనంతరం పైపులపై మొరు పోశారు. అయితే కొద్ది రోజులుగా తేలికపాటి వర్షాలు కురువడంతో మలుపు వద్ద బురదగా మారి ప్రమాదకరంగా తయారైంది. కాలువ వెడల్పు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా మొరం పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం వెంబడి అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా బురదలో అదుపుతప్పి పడిపోతున్నాయి. రెండు రోజుల క్రితం గాదేపల్లి చిన్న యానం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అక్కడ వేసిన మొరంలో దిగబడిపోయింది. దీంతో స్థానికుల ట్రాక్టర్ సాయంతో బస్సును బయటకు తీశారు. అలాగే ప్రైవేటు పాఠశాలకు ఓ బస్సు కూడా ఆ ప్రాంతంలో దిగబడింది. దీంతో ఈ మార్గంలో వాహనదారులు ప్రయాణించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



● బురదమాయంగా నూత్‌పల్లి రోడ్డు

వన మహోత్సవానికి ప్రాధాన్యమివ్వాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

నిజామాబాద్ అర్బన్, జూలై 9: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వన మహోత్సవ కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వి.శాంతికుమారి సూచించారు. వన మహోత్సవం, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, మహిళా శక్తి కేంద్రాలు, సీజనల్ వ్యాధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల చేపడుతున్న పనులతో పాటు ధరణి దరఖాస్తులు, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, ఉద్యోగుల సాధారణ బదిలీలు తదితర అంశాలపై మంగళవారం సాయంత్రం ఆమె జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో సమీక్షించారు. వర్షాలు ఒకింత ఆలస్యం అయినప్పటికీ ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్నందున పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ఇది అనువైన సమయం కావున దీన్ని దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20కోట్లకు పైగా మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకోవడం జరిగిందన్నారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయించాలని కాగా ఆగస్టు నెలాఖరు నాటికి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వంద శాతం మొక్కలు నాటాలన్నారు. ముఖ్యంగా అటవీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలు వన మహోత్సవం విజయవంతంలో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకొని పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా వివిధ వర్గాల వారిలో స్ఫూర్తిని పెంపొందించాలన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమాన్ని అన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేయాలన్నారు. ఇప్పటికే మహిళలను భాగస్వామ్యం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల నేతృత్వంలో మౌలిక సదుపాయాల మెరుగుదల పనులు చేపట్టడంతో పాటు విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యతను కూడా మహిళా స్వయం సహాయక సంఘాలకే అందించడం జరిగిందన్నారు. మరో నెలరోజుల్లోపు రెండో జత యూనిఫాంలను కూడా కుట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి ద్వారా మహిళలు డెయిరీ, పౌల్ట్రీఫామ్, క్యాంటీన్ వంటి యూనిట్లను స్థాపించేందుకు, చిన్నతరహా పరిశ్రమలు, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఉండే వ్యాపారాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రభుత్వ పరంగా తోడ్పాటును అందించాలన్నారు. 16 రకాల యూనిట్లు ఇందులో భాగమని బ్యాంకు లింకేజీ రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వంట గది, టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆశాలు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా పనిచేయాలని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ఎరువులు ఎలాంటి కృత్రిమ కొరత లేకుండా చూడాలని రైతుభరోసా, రైతునేస్తం కార్యక్రమాల ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, నూతన సాగు విధానాలపై కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ నెల 20లోగా ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ విసిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, జడ్పీ సీఈవో ఉషా, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీపీవో చక్రవర్తి తరుణ్‌కుమార్, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, సీపీవో మల్లికార్జున్, మెప్మా పీడీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ఇతర అధికారులు

నూతన చట్టాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సీడీటీఐ డైరెక్టర్ రాజశేఖర్, చిత్రంలో సీపీ కల్మేశ్వర్

ఖిల్లా, జూలై 9: నూతన చట్టాలపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించడంతో పాటు వారి నుంచి అభిప్రాయాల సేకరణను సీనియర్ అధికారులు చేపట్టారు. మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ బ్యూరో ఆఫ్ పోలీస్ రిచర్స్ అండ్ డెవలప్‌మెంట్, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇంటెలిజెన్స్ బ్యూరోల ఆధ్వర్యంలో మంగళవారం రెండో రోజు ఈ సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన నేర న్యాయచట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరి సురక్ష సంహిత, భారతీయ సాక్ష అధినీయం అనే చట్టాలపైన సీడీ టీయూ డైరెక్టర్ రాజశేఖర్ అధికారులకు వివరించారు. జిల్లాకు చెందిన అధికారుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. పోలీసు అధికారుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ సమావేశంలో నగర పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగెనెవార్‌తో పాటు కేంద్ర హోం అఫైర్స్ అధికారులు కుర్ర శ్రీనివాస్, రాజేష్‌కుమార్ జా, సూరపల్లి శ్రీనివాస్‌తో పాటు అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, బస్వారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు, సీసీఆర్‌డీ ఏసీపీ రవీందర్‌రెడ్డితో పాటు సీఐలు, ఎస్సైలు, కోర్టు రైటర్లు, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.



మరమ్మతు పనులను సత్వరమే పూర్తిచేయాలి

● కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశం

నందిపేట, జూలై 9: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని రాజానగర్ దుబ్బా ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అలాగే మాక్లూర్ మండలంలోని ముల్లంగి, బోంకన్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలలను అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలుగా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలోని వంట గది, వరండా, అదనపు గదులు, వాటర్ ట్యాంకు, టాయిలెట్స్ తదితర నిర్మాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు చాలా చోట్ల పూర్తయినాయని, మిగతా చోట్ల వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాజీవ్ ఆదేశించారు. అవసరమైన పనులు మాత్రమే చేపట్టాలని, వాటిలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. వర్షాకాలం సీజన్ కనుక పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. అన్ని పాఠశాలల్లో మొక్కలు విరివిగా నాటి లక్ష్యాన్ని సాధించాలని కోరారు.


కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న రాజానగర్ కాలనీ వాసులు


ముల్లంగిలో మొక్క నాటుతున్న కలెక్టర్

కలెక్టర్‌కు కాలనీ వాసుల సమస్యల మొర..

నందిపేట మండల కేంద్రంలోని రాజానగర్ దుబ్బా ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేయడానికి వచ్చిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు కాలనీ వాసులు సమస్యలను మొర పెట్టుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మీరు రావడంతోనే రోడ్లను శుభ్రం చేయించారని, మురికి కాలువలు శుభ్రం చేశారని కాలనీ వాసులు కలెక్టర్‌కు తెలిపారు. దీనికి స్పందించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు కాలనీలో తిరిగారు. ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా? వాటర్ సప్లయ్ కనెక్షన్‌లు ఉన్నాయా? సర్వే బృందాలు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారా అంటూ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆరా తీశారు. నందిపేటలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి కాలనీలు, మురికి కాలువలు, రోడ్లు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి నవీన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నందిపేట, మాక్లూర్ మండలాల ప్రత్యేక అధికారులు జగన్నాథ చారి, ముత్తెన్న, పంచాయతీ రాజ్ ఈఈ బావన్న, జడ్పీ ఇన్‌చార్జి డిప్యూటీ సీఈవో బి శ్రీనివాస్ రావు, తహసీల్దార్ ఆనంద్ కుమార్, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో కిరణ్ కుమార్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.




క్రీడామైదానం కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేసిన దృశ్యం

క్రీడామైదానం కబ్జాకు యత్నం!

● అడ్డుకున్న క్రీడా సంఘాల నాయకులు

సుభాష్‌నగర్, జూలై 9: క్రీడా మైదానంపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. క్రీడామైదానం కోసం కేటాయించిన స్థలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి వ్యాపారులు సన్నద్ధమయ్యారు. రాత్రి ఎవరూ లేని సమయంలో క్రీడా మైదానం కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేశారు. ఉదయం క్రీడామైదానం కోసం కేటాయించిన స్థలం చదును చేశారన్న విషయం తెలుసుకున్న పలు క్రీడా సంఘాల నాయకులు, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు క్రీడామైదానం స్థలానికి వెళ్లి అడ్డుకున్నారు. 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఖలీల్‌వాడి మైదానాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి ఇవ్వడంతో నగరంలో క్రీడా స్థలం లేకపోవడంతో గంగాస్థాన్‌లో ఏడు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. గంగాస్థాన్‌లోని ఒలింపిక్ సంఘం పక్కనగల 106 సర్వే నంబర్‌లో ఏడు ఎకరాల స్థలాన్ని అప్పటి ప్రభుత్వం కేటాయించింది. అప్పటి నుంచి ప్రభుత్వం మైదానం వైపు చూడకపోవడంతో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో కబ్జాదారులు ప్రతీసారి క్రీడామైదానంవైపు చూడసాగారు. దీన్ని ప్రతీసారి ప్రతిఘటిస్తూ వచ్చిన క్రీడాసంఘాలు ఇంకా ఎన్నిరోజులు క్రీడామైదానాన్ని కాపాడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నూతనంగా వచ్చిన ప్రభుత్వం క్రీడామైదానం నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు.






వెల్నెస్ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

వెల్నెస్ సెంటర్ పరిశీలన

● వసతులపై ఆరాతీసిన మున్సిపల్ కమిషనర్

సుభాష్‌నగర్, జూలై 9: వెల్నెస్ సెంటర్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న వెల్నెస్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. అనంతరం సిబ్బందికి కల్పిస్తున్న వసతులపై అడిగి తెలుసుకున్నారు. జూలై 3న 'ఆంధ్రజ్యోతి'లో వెల్నెస్ సెంటర్‌లో వసతులలేమి కథనంతో ప్రచురణకు స్పందించిన కలెక్టర్.. మున్సిపల్ కమిషనర్‌ను వసతులపై పరిశీలించాలని కోరారు. అంతేకాకుండా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కూడా కలెక్టర్‌ను కలవడంతో మంగళవారం వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించి వెల్నెస్ సెంటర్‌కు కావాల్సిన వసతులపై సిబ్బందితో చర్చించారు. ప్రస్తుతం ఉన్న భవనం వెల్నెస్ సెంటర్‌కు సరిపోకపోవడం లేదని సిబ్బంది చెప్పడంతో రెండు మూడు రోజుల్లో అదనపు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు. బాత్‌రూమ్‌ల పరిస్థితిని చూసి వాటి సమస్యను కూడా పరిష్కరిస్తామని తెలిపారు. కమిషనర్‌తో పాటు పెన్షనర్ల సంఘం నాయకులు రామ్మోహన్‌రావు, ప్రసాద్‌రావు, రాధాకిషన్, భోజారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకపౌర్ణమి సందర్భంగా అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

సుభాష్‌నగర్, జూలై 9: కార్తీకపౌర్ణమి సందర్భంగా అరుణాచలంకు ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు నిజామాబాద్ ప్రాంతీయ అధికారి కె.జానిరెడ్డి తెలిపారు. జూలై 21న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సును డిపో-2 నుంచి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 19వ తేదీన రాత్రి 8గంటలకు నిజామాబాద్ నుంచి బయలుదేరి 20వ తేదీన ఉదయం 10గంటలకు కాణిపాక విఘ్నేశ్వర దర్శనార్థం చేరుకుంటుందన్నారు. అనంతరం సాయంత్రం 5గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్ నుంచి అరుణాచలంకు చేరుకుంటుందన్నారు. రాత్రి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 21న సాయంత్రం 5గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరి 22వ తేదీన ఉదయం 4గంటలకు జోగులాంబ ఆలయానికి చేరుకుంటుందన్నారు. దర్శనం అనంతరం ఉదయం 9గంటలకు జోగులాం బ ఆలయం నుంచి బయలుదేరి సాయంత్రం 6గంటలకు తిరిగి నిజామాబాద్‌కు చేరుకుంటుందన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.4,200, పిల్లలకు రూ.3,400 ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాల ప్రయాణికులు అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బస్సు రిజర్వేషన్ కౌంటర్ లేదా ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుక్ చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు.

ఎస్సారెస్పీలోకి 3275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మెండోర, జూలై 9: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులోకి ఎగువకు ఉన్న మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 3275క్యూసెక్కుల నీరు వస్తుందని ప్రా జెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80టీఎంసీ) కాగా మంగళవారం సాయంత్రానికి 1061.70 అడుగుల (12.208టీఎంసీ) నీటి నిల్వ ఉందని, గత సంవత్సరం ఇదే రోజు 1066.60అడుగుల (16.824టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని, జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి ఆరు టీఎంసీల నీరు వచ్చి చేరిందని ఈఈ తెలిపారు.

పీజీ సెమిస్టర్ పరీక్షల ఫీజు తేదీ ప్రకటన

డిచ్‌పల్లి, జూలై 9: విశ్వవిద్యాలయం పరిధిలో 2020-21 విద్యా సంవత్సరం పీజీ, ఎంబీఏ, ఎంసీఏ 2వ సెమిస్టర్, ఐఎంబీఏ 8వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షల తేదీని మంగళవారం అధికారులు విడుదల చేశారు. విద్యార్థులు జూలై 1లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని రూ.100 అపరాధ రుసుముతో జూలై 19 వరకు చెల్లించవచ్చునని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎంఈడీ పరీక్షలకు 10మంది విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి, జూలై 9: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ 1వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ముగిశాయి. గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో జరిగిన పరీక్షకు 35మంది విద్యార్థులకు గాను 28మంది హాజరయ్యారని, 7గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం డిగ్రీ రెండు విడతల్లో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 255మంది విద్యార్థులకు గాను 245మంది విద్యార్థులు హాజరయ్యారని 10మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి'

డిచ్‌పల్లి, జూలై 9: తెలంగాణ విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరికి వినతి పత్రం అందజేశారు. సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 15నుంచి ప్రారంభిస్తున్నారని, ఇదే నెలలో డీఎస్సీ పరీక్షలు ఉన్నాయని యూనివర్సిటీలో చాలా మంది విద్యార్థులు డీఎస్సీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారని వారు తెలిపారు. ఎలాగైనా వర్సిటీ పరీక్షలను వాయిదా వేయాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనునాయక్ మంగళవారం రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. డీఎస్సీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో వర్సిటీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మహేశ్, హరిత, సౌందర్య, రమ్య పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న కార్మికులు

'బకాయి వేతనాలు చెల్లించాలి'

ఎడపల్లి, జూలై9: తమకు రావాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు మంగళవారం ఎడపల్లి గ్రామ పంచాయతీ కార్యలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, గత ఐదునెలలుగా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికు ల బకాయివేతనాలు వెంటనేచెల్లించి, వారిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, కారోబార్, బిల్ కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించి ప్రభుత్వం ద్వారా జీతాలు ఇవ్వాలని, పంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేస్తున్నట్లు ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో పంచాయతీ కార్మికులందరూ సమస్య పరిష్కారం అయ్యేవరకు హైదరాబాదులోనే ఉంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షురాలు పద్మ, కారోబార్ల సంఘం అధ్యక్షులు రాజు, పండరీ, అఫ్రోజ్ ఉన్నారు.

'ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి'

బోధన్ రూరల్, జూలై9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలలో దివ్యాంగులకు ఇచ్చినమాట నిలబెట్టుకోవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు ఏశాల గంగాదర్ డిమాండ్ చేశారు. మంగళవారం సాలూర మండలంలోని హున్స గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు 6వేల పించన్ ఇస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో 5శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. డబుల్ బెడ్ రూమ్‌లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గైని రాములు, సాలూర మండల అధ్యక్షులు షేక్.నజీర్, సాలూర మండల కార్యదర్శి సింగడి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సిరిగిరి దేవదాస్, హున్స గ్రామ అధ్యక్షులు బాలేరావు, సాయిలు, కార్యదర్శి జగదీష్, కోశాధికారి లలిత, తదితరులు పాల్గొన్నారు.

మెండోరలో ఘనంగా బోనాల జాతర

మెండోర, జూలై9: మండలకేంద్రంలో ఆరే కటికె సూర్యవంశం సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు బోనాల జాతర పండగను ఘనంగా నిర్వహించారు. మంగళవారం మెండోర మండల ఆరె కటికె సంఘ సభ్యులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మండల ఆరె కటికె కులస్తులు మండల కేంద్రంలో పోచమ్మతల్లికి గ్రామం నుంచి మంగళహారతులతో ఊరేగింపుగా మహిళలు బోనాలుఎత్తుకొని డప్పులతో శివసత్తులు పునకాలతో ఊరేగింగా పోచమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ఆరెకటికెకుల సంఘ సభ్యులు తమ పిల్లపాపలతో వనభోజనాలు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆరె కటికె సంఘ సభ్యులు లింబాజీ, గణేష్, కిషన్, రమేష్, విఠల్, అశవర్, శంకర్, రాము, చందు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న అరికెటికె కులస్థులు

గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

● ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, జూలై9: నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి ప్రధానరోడ్లు గుంతలుగా మారి నగర ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గుంతలు పడిన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్అండ్‌బీ అధికారులతో ఆయన సమీక్షనిర్వహించారు. రోడ్డు మరమ్మతులు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. టీయూఎఫ్ఐడీఎస్ ఫండ్‌లో మిగిలిన పనులు కూడా వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎక్కడైనా కొత్త రోడ్లు వేసినప్పుడు మంచి క్వాలిటీతో వేయాలని లేదంటే ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. బ్రిడ్జి పనులు శరవేగంగా పూర్తి చేయాలని అలాగే అర్సపల్లి ఆర్‌వోబి బ్రిడ్జిని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ గజవాడ హన్మంత్‌రావు, ఏఈ మురళి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ప్రవీణ్, ఏఈలు సాయికుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి, జూలై9: పొతంగల్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. హంగర్గ మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తిర్మలాపూర్ సమీపంలో మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. మూడు ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆర్టీఓతోపాటు మైనింగ్‌కు సిఫారసు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

● ముప్కాల్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముప్కాల్: అనుమతి లేకుండా రాత్రివేళలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై బాస్కరచారి తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్ ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఇసుక తరలిస్తున్న నిందితుడిపై ఎస్సై కేసు నమోదు చేసి రూ.5వేల జరిమానా విధించినట్టు తహసీల్దార్ పేర్కొన్నారు.

జీవో 10ని రద్దు చేయాలి: సీఐటీయూ

పెద్దబజార్, జూలై9: జీవో 10ని రద్దుచేసి సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి నూర్జహాన్ అన్నారు. మంగళవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను 65 ఏళ్ల పూర్తయిన వారికి అతితక్కువ రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ ఇంటికి పంపుతూ ఇచ్చిన జీవో 10ని రద్దు చేయాలన్నారు. యూనియన్ జిల్లా కోశాధికారి చంద్రకళ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలతోపాటు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్‌ను పెంచాలని 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు రాష్ట్రంలో 24 రోజులు నిరవదిక సమ్మె చేయడం జరిగిందన్నారు. అనంతరం అంగన్‌వాడీ దీక్షలకు రిటైర్డ్‌మెంట్ ఉద్యోగుల కార్యదర్శి రామ్మోహన్‌రావు సంఘీభావం తెలిపారు. ఇందులో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కోటగిరి, జూలై9: పొతంగల్ మండలంలోని జల్లాపల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య (11) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. సోమవారం తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్న ఐశ్వర్యను చికిత్స నిమిత్తం బోధన్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో జిల్లాఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

రుద్రూరు, జూలై9: అనారోగ్య సమస్యలతో ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూరులోని చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రేణుక (48). గత ఐదేళ్లుగా తలభాగంలో నరాల బలహీనత వ్యాధితో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నా తగ్గలేదు. దీంతో ఆమె తీవ్రమైన తలనొప్పి భరించలేక మనస్తాపం చెంది తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు చెందింది. భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

బోధన్‌రూరల్, జూలై9: పట్టణంలోని మహాలక్ష్మి ఆలయంలో మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాల ఊరేగింపుగా మహాలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కుల సంఘ నాయకులు అశోక్, భూంపల్లి సత్యనారాయణ, ఇందూరు కృష్ణ, శ్రావణ్, రాములు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

ఎడపల్లి, జూలై9: మండలంలోని ఎడపల్లి నుంచి ఎరాజ్‌పల్లి వెళ్లే దారిలోని వృద్ధాశ్రమం సమీపంలో పంటపొలంలో ఉన్న టాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. అందులో ఉన్న రాగి వైరును ఎత్తుకెళ్లారని రైతులు తెలిపారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో టాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసినట్లు చెప్పారు. కొందరు కావాలనే టాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేస్తూ అందులోని రాగివైరును ఎత్తుకెళ్లి పంట పొలాలకు నష్టం కలుగ జేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి విద్యుత్ నియంత్రికలు ధ్వంసం కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్



ఈరవత్రి అనిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

చైర్మన్లను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి, జూలై 9: రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఈరవత్రి అనిల్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సుంకెట అన్వేష్‌రెడ్డిలను మంగళవారం కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఛైర్మన్లను కలిసినవారిలో కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్‌అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా మైనారిటీ నాయకుడు అబ్దుల్‌రఫీ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, ఉప్లూర్ మాజీ సర్పంచ్ బద్దం రమేష్‌రెడ్డి, దేవాయి రాజేశ్వర్ ఉన్నారు.

టీయూ బాయ్స్ హాస్టల్‌లో యువతికి వసతి

● విద్యార్థిని సస్పెండ్ చేసిన రిజిస్ట్రార్ ● ఆలస్యంగా వెలుగులోకి..

డిచ్‌పల్లి, జూలై9: తెలంగాణ యూనివర్సిటీలోని బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థి తనకు పరిచయం ఉన్న ఓ యువతికి వసతి కల్పించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకిచూసింది. యూనివర్సిటీలో రెండో సంవత్సరం అభ్యసిస్తున్న ఓ విద్యార్థి న్యూబాయ్స్ హాస్టల్ ఉంటున్నాడు. అయితే గతంలో డిగ్రీ చదివే సమయంలో తనకు పరిచయం ఉన్న ఓ స్నేహితురాలు నిజామాబాద్‌కు రావడంతో ఆమెను నేరుగా తానుఉంటున్న వర్సిటీలోని బాలుర హాస్టల్‌కు తీసుకొచ్చి ఉంచినట్లు తెలుసింది. ఈ విషయం తోటి విద్యార్థులు గమనించి హాస్టల్ చీఫ్ వార్డెన్‌కు సమాచారం ఇవ్వగా ఈ ఘటనపై రిజిస్ట్రార్ యాదగిరి విచారణ చేపట్టడంతో అసలు విషయం బయటపడింది. బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థి గత 15 రోజుల కిందట యువతిని గదిలోకి తీసుకొచ్చి వసతి కల్పించినట్లు తేలడంతో సదరు బాలుడిని యూనివర్సిటీ హస్టల్ నుంచి, వర్సిటీ నుంచి సస్పెండ్ చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. బాలురహస్టల్‌లోకి యువతిని తీసుకొచ్చినప్పుడు సెక్యూరిటీ నిర్లక్ష్యంగా వ్యహరించారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నారు. హస్టల్ వార్డెన్, సిబ్బందినిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘనలు చోటు చేసుకుంటున్నాయని విద్యార్థి సంఘల నాయకులు ఆరోపిస్తున్నారు.

చింతలూర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వీడీసీ సభ్యులు

జక్రాన్‌పల్లి, జూలై9: మండలంలోని చింతలూర్ గ్రామంలోని నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి వీడీసీ సభ్యులు కలిశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్, వీడీసీ సభ్యులు కలిసి సన్మానించారు. గ్రామంలోని కొండపైఉన్న ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని, నిజామాబాద్ నుంచి చింతలూర్ మీదుగా భీమ్‌గల్‌వరకు ఆర్టీసీ బస్సును నడిపించాలని, గ్రామానికి వచ్చే చెరువు వచ్చే కాలువ తూంలను నిర్మించాలని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కొలిప్యాక్ సింగిల్‌విండో ఛైర్మన్ నాగుల శ్రీనివాస్, చింతలూర్ వీఈసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో

12న వాహనాలకు వేలం

బోధన్‌రూరల్, జూలై 9: బోధన్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదిన నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు బోధన్ ఎక్సైజ్ సీఐ పవన్ గౌడ్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఉదయం 9గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్వస్థలాలకు గొర్రెల కాపరుల పయనం



గొర్రెల మందను తీసుకెలుతున్న యజమానులు

పెద్ద కొడప్‌గల్, జూలై9: వానకాలం ప్రారంభం అయి చిన్నపాటి వర్షాలు కురుస్తుండటంతో జుక్కల్ నియోజకవర్గంలోని అయా మండలాల గ్రామాల్లో గల గొర్రెల యజమానులు తమ స్వస్థలాలకు బయలు దేరారు. తెలంగాణకు పక్కనే ఉన్న మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన గొర్రెల యజమానులు వేసవి కాలంలో అక్కడ నీటి కొరత,మేత కొరత ఉండటంతో ప్రతి సంవత్సరం వేసవి కాలం ప్రారంభంలోనే జుక్కల్ నియోజక వర్గంలోని వివిధ మండలాలలోని గ్రామాలకు గొర్రెలతో సహా వలస వస్తారు. వేసవి కాలం ఈ ప్రాంతంలోనే ఉండి తమ గ్రామాలలో వర్షాలు కురియగానే గొర్రెలతో సహా తిరిగి వెల్తారు. ప్రతీ సంవత్సరం మాదిరగానే ఈ సారి కడ మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన గొర్రెల యజమానులు జుక్కల్, బాన్స్‌వాడ నియోజక వర్గాలకు వలస వచ్చారు. ప్రస్తుతం వారి స్వస్థలాలలో వానలు కురియడంతో జుక్కల్, బాన్స్‌వాడ నియోజక వర్గాలలో ఉన్న గొర్రెల యజమానులు, కాపరులు తవ స్వంత స్థలాలకు పయనం అవుతున్నారు.

కళకళలాడుతున్న ఆరుతడిపంటలు



పెద్ద కొడప్‌గల్‌లో కళకళలాడుతున్న సోయా పంట

పెద్ద కొడప్‌గల్, జూలై 9: పెద్ద కొడప్‌గల్, జుక్కల్ మండలాలలో ఖరీప్ సీజన్ కింద రైతన్నలు ఆరుతడి పంటలు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఆరుతడి పంటలలో భాగంగా సోయా, పత్తి, మొక్కజొన్న, పెసర, మినుములాంటి పంటలను సాగు చేస్తారు. గత 20 రోజుల కిందట కురిసిన వర్షాలకు ఆరుతడి పంటలను సాగు చేశారు. ప్రస్తుతం జుక్కల్, పెద్దకొడప్‌గల్ మండలాల్లో గత వారం రోజుల నుంచి చిన్నపాటి వర్షాలు కురియడంతో ఆరుతడి పంటలు ఎక్కడ చూసిన కళకళలాడుతున్నాయి. రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.సోయా, పత్తిలాంటి సాగు చేసిన పంటలు కలుపురా వడంతో రైతన్నలు కలుపునివారణ కోసం పురుగు మందులను పిచికారి చేసే పనులలో బిజీగా మారారు.అయితే వరిపంట సాగుకోసం అవసరమైన వర్షాలు కురియకపోవడంతో వరిసాగుచేసే రైతన్నలు వర్షాల కోసంఎదురు చూస్తున్నారు.

ఇంటింటికి మొక్కల పంపిణీ

పెద్ద కొడప్‌గల్, జూలై 9: జుక్కల్ మండలంలోని ఖండెబల్లూర్ గ్రామంలో మంగళవారం జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ హోంస్టీడ్ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాలలో ఉన్న ప్రజలు ప్రతీ ఇంటికి తప్పని సరిగా మొక్కలు పెంచుకోవాలని సూచించారు. మొక్కలు పెంచడం వలన వాతావరణం బాగు పడటంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని తెలిపారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

ఏటీఎం మిషన్‌నే ఎత్తుకెళ్లిన దొంగలు

బిచ్కుంద,జూలై 9:ఎక్కడైనా ఏటీఎంమిషన్‌ను ధ్వంసం చేసి అందులోని నగదును దొంగలు ఎత్తికెళ్లిన సంఘటనలు తరచూ కనిపిస్తాయి.కాని బిచ్కుందలో మాత్రం దొంగలముఠా ఏకంగా ఏటీఎం మిషన్‌నే ఎత్తుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది.బిచ్కుంద మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్దగల ఏటీఎం మిషన్‌బాక్స్‌ను మంగళవారం తెల్లవారుజామున దొంగలు ఎత్తుకెళ్లారు. ఏటీఎం బాక్స్‌ను ఆయుధపరికరాలతో పెకిలించే బిగించబడిన వాటిని తొలగించి తాళ్లతో ఏటీఎం మిషన్‌ను దొంగలు తెచ్చుకున్న వాహనంలోకి ఎక్కించుకుని పారిపోయారు.ఏటీఎంను ధ్వంసం చేసిన దృశ్యాన్ని చూసిన కొందరు బ్యాంక్, పోలీసుఅధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఏటీఎం రూమ్‌లో బిగించిన సీసీ కెమెరాలో దొంగతనం దృష్యాలు రికార్డులను పోలీసులు పరిశీలించారు.ఈ విషయం తెలుసుకున్న బాన్సువాడ డీఎస్‌పీ,బిచ్కుంద సీఐ సంఘటన స్థలానికి చేరుకుని పోలీసుసిబ్బందితో రెండుటీంలను ఏర్పా టుచేసి మహారాష్ట్రలోని ముఖేడ్,హనేగావ్, కర్ణాటక ఔరాద్‌వైపు గాలింపు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఏటీఎం మిషన్‌లో 3.90లక్షల నగదు ఉన్నాయని బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దొంగలకోసం గాలింపు చేపడుతున్నట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

● ఏటీఎం చోరీకి ఉపయోగించిన వాహనం

పెద్ద కొడప్‌గల్: బిచ్కుంద మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున ఏటిఎం దొంగతనానికి పాల్పడిన క్వాలీస్ వాహనాన్ని దుండగులు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో వదిలి వెల్లారు. ఏటిఎం దొంగతనం జరిగిన విషయంసీరియస్‌గా తీసుకున్న పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టడంతో ఏటిఎం దొంగతనానికి ఉపయోగించిన వాహనం జుక్కల్ మండలం పెద్ద గుల్లా తండా దాటిన తర్వాత మహారాష్ట్ర సరిహద్దులో పోలీసులు కనుగొన్నారు. ఏటీఎం దొంగతనం చేసిన దుండగులు జుక్కల్ మండలంలోని పెద్ద ఏడ్గి గ్రామం మీదుగా మహారాష్ట్రకు పారిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



వాహనంలోకి ఏటీఎంను ఎక్కిస్తుండగా సీసీకెమెరాలో రికార్డు అయిన దృశ్యాలు

● పెద్ద ఏడ్గిలో రెండు ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లిన దుండగులు

ఏటిఎం దొంగతనానికి పాల్పడిన దుండగులు పెద్ద ఏడ్గి గ్రామంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎత్తుకెల్లారు. గ్రామానికి చెందిన సుంకర్‌వార్ హన్మండ్లు, నీలకంఠ్‌రావ్‌లు తమ ఇంటి ముందర ద్విచక్ర వాహనాలు పార్కుచేయగా తెల్లవారు జామున వచ్చిన ఏటీఎం చోరీ చేసిన దుండ గులు రెండు ద్విచక్ర వాహనాలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఏటీఎం చోరీకి ఉపయోగించిన క్వాలీస్ వాహనాన్ని దుండ గులు మహారాష్ట్ర సరిహద్దులో వదిలి దొంగతనం చేసిన బైక్‌లపై పారిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



మహారాష్ట్ర సరిహద్దులో వదిలిన వాహనం

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



మృతుడు పోశెట్టి

రుద్రూరు, జూలై 9: పురుగుల మందు సేవించి చికిత్స పొందు తూ వృదుడు మృతి చెందిన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం..రుద్రూరు మండలం లోని రాయకూర్ గ్రామానికి చెందిన కాంతపు పోశెట్టి (60) వృద్ధుడు గత కొంతకాలంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడు. అనారోగ్య సమస్యలను తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం 9గంటల సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగి అది గమనించిన కుమారుడు శంకర్ వెంటనే పోశెట్టిని 108 అంబులెన్స్‌లో బోధన్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరిగి అక్కడి నుంచి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మంగళవారం కుమా రుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మాజీలకు సన్మానం

బీర్కూర్, జూలై 9: బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం తాజా మాజీలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇటీవల పదవి కాలం పూర్తి చేసు కున్న తాజా మాజీ, ఎంపీపీ రఘు, స్థానిక ఎంపీటీసీ సావిత్రిలకు పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారు చేసిన సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పారావు, సాయిబాబా, హన్మంత్‌రావు, మురళి, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

బోధన్‌రూరల్, జూలై9: బోధన్ పట్టణంలోని మధుమలాంచ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రముఖ్ తలాండే ఈశ్వర్‌కుమార్ 76వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తదానం మహ దానం అని, రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందన్నారు. 1949జులై 9న కేవలం 25మంది విద్యార్థులతో ఢిల్లీ యూనివర్సిటీలో ప్రారంభమైన ఏబీవీపీ నేడు వేలాది మంది విద్యార్థులతో కూడుకుని ఉందన్నారు. విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సీనియర్ నాయకులు ఈండ్ల సూర్య కుమార్, లక్ష్మణ్ చౌహాన్, ఆదు సింగ్, గంగాసింగ్, అరవింద్, సురేష్, రాజారాం, జగదీష్, రాములు, రాష్ట్ర వనవాసి సెల్ కన్వీనర్ లక్ష్మణ్ చౌహాన్‌లతో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం

కామారెడ్డిటౌన్, జూలై 9: జిల్లాలోని అయా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం, బస్సు డ్రైవర్లకు కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆర్‌టీవో శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈకార్యక్రమానికి కలెక్టర్,ఎస్పీలు హాజరవుతారని తెలిపారు.

ఏసీజీఈకి సన్మానం

కామారెడ్డిరూరల్, జూలై 9:కామారెడ్డి ఉపాధ్యాయసమాఖ్యల ఆధ్వర్యంలో నూతనంగా నియామకమైన ఏసీజీఈ(అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్) బలరాంను మంగళవారం సన్మానించారు.ఈ కార్యక్రమంలో డీఈవో రాజు,సమాఖ్య ఛైర్మన్ యాదయ్య, కోఛైర్మన్ బషీర్, ఆర్గనైజర్ ప్రవీణ్‌కుమార్, రాజకుమార్, శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి వేణుశర్మ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలి



మొక్కలను నాటుతున్న డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్

గాంధారి, జూలై 9:ప్రతీ గ్రామపంచాయతీ కార్యదర్శి ఇంటింటికి మొక్కలను పంపిణీ చేసి అవి నాటే బాధ్యతను తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గుడిమెట్, మాధవ్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో హరితవనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: ప్రతీఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని భిక్కనూరు వైద్యాధికారిణీ యేమిమా సూచించారు. మంగళవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో వైద్యసిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

దోమకొండ, జూలై 9: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు తహసీల్దార్ సంజయ్‌రావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం, రెండు లక్షల రుణమాఫీ, కౌలురైతులకు ఇచ్చిన హామీలను అందజేయలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు అనుపాటి నరేందర్‌రెడ్డి, సంతోష్, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు చింతల రాజేష్, పన్యాల రవీందర్‌రెడ్డి, యువమోర్చా మండలాధ్యక్షుడు కంది మనోజ్ కుమార్, కుర్రి శంకర్, కుంచని జగదీష్, కూర అంజలి, ఎస్‌పాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిని పరిశీలించిన కేంద్ర బృందం

రెంజల్,జూలై9: జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెంజల్ మండల కేంద్రంలోని మిషన్ భగీరథ నీటిని జల్ జీవన్ కేంద్ర బృందం నీటి నమూనాలను సేకరించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీరు కలుషితం కాకుండా ఉండేందుకు నీటి నమూనాలను సేకరించినట్లు కేంద్ర బృందం సభ్యులు తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ట్యాంకుల వద్ద నీటి నమూనాలను సేకరించి నీటిని పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ డీఈ మున్ని నాయక్, ఏఈ గబ్బర్ సింగ్, చంద్రకాంత్, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.39లక్షల విలువైన గుట్కా పట్టివేత



జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్న వాహనం ఇదే..

డిచ్‌పల్లి, జూలై9: డిచ్‌పల్లిలో గల 44వ జాతీయ రహదారి మీదుగా మెంట్రాజ్‌పల్లి వద్ద నాగపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుట్కా ప్యాకెట్లతో ఐచర్ వాహనాన్ని మంగళవారం సాయంత్రం పోలీసులు ప ట్టుకున్నారు. ఈవాహనంలో రూ. 39లక్షలు విలువ చేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ముగ్గురు నిందితులను, ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్

'నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై మోదీ స్పందించాలి'

మోర్తాడ్, జూలై 9: నీట్ పరీక్షను రద్దుచేసి ప్రజలకు న్యాయం చేయాలని పేపర్ లీకేజీపై ప్రధాని మోదీ స్పందించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్‌చేశారు. మంగళవారం మోర్తాడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రం పేపర్ లీకేజీపై నిందితుడి వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని, 23లక్షల మంది విద్యార్థులు ఈపరీక్ష ద్వారా నష్టపోయారని తెలిపారు. పేపర్ లీకే అయ్యిందని సుప్రీంకోర్టు చెప్పినా ప్రభుత్వం పరీక్షను రద్దు చేయకపోవడం దారుణమన్నారు. పేపర్ లీకేజీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. సమావేశంలో మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

800 గ్రాముల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్టు, నలుగురు బైండోవర్


నిందితుడి వివరాలు తెలుపుతున్న సీఐ స్టీవెన్‌సన్

ఆర్మూర్‌టౌన్, జూలై 9: పట్టణంలోని నిజామాబాద్ రోడ్డు జాతీయ రహదారిపై ఓ రెస్టారెంట్ వద్ద ఎండు గంజాయిని అమ్ముతున్న పెర్కిట్‌కు చెందిన మహమ్మద్ వహిద్‌అలీని అరెస్టు చేసినట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు మంగళవారం ఓ రెస్టారెంట్ వద్ద దాడిచేయగా 800 గ్రాముల గంజాయి మహమ్మద్ వహిద్‌అలీ వద్ద స్వాధీనం చేసుకొని గంజాయి తాగుతున్న నలుగురు వ్యక్తులను గుర్తించి తహసీల్దార్ గజానంద్ వద్ద బైండోవర్ చేసినట్టు సీఐ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి కిలో ఎండుగంజాయిని తీసుకువచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయం చేస్తున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. గంజాయి అమ్ముతున్న, కొనుగోలు చేస్తున్నట్లు తెలిస్తే 8712658974 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో దర్మేందర్, సందీప్, వికాష్‌గౌడ్, నరేష్, సాయిబాబా, తదితరులు ఉన్నారు.

రూ.5లక్షల విలువ చేసే నిషేధిత గుట్కా పట్టివేత

ఖిల్లా, జూలై 9: రూ.5లక్షల విలువచేసే నిషేధిత గుట్కాను టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్నట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. కచ్చితమైన సమాచారం మేరకు సీపీ కల్మేశ్వర్‌శింగేనవార్ ఆదేశాలమేరకు నగరంలోని పాతగంజ్ సమీపంలోగల హెచ్‌కే జర్దా దుకాణంలో టాస్క్‌ఫోర్స్ బృందందాడి చేశారన్నారు. ఈదాడిలో నిల్వ ఉంచిన నిషేధిత గుట్కాను వారుగుర్తించారు. దానిని స్వాధీనం చేసుకుని కేసునమోదుకు 1వ టౌన్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

'మధ్యాహ్నభోజన నిర్వాహకులకు బిల్లులు చెల్లించాలి'

మోర్తాడ్, జూలై 9: మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని ఎండీఎం రాష్ట్రఉపాధ్యక్షుడు చక్రపాణి డిమాండ్‌చేశారు. మంగళవారం మండల మధ్యాహ్నభోజన కార్మికులతో మండల విద్యాధికారి భవనం ఎదుట ఆందోళన చేశారు. కార్మికులకు గత 5నెలల నుంచి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని, దుకాణదారులు సామాన్లు ఇవ్వడంలేదని వాపోయారు. గతప్రభుత్వం ఇచ్చిన మాటప్రకారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రూ.10వేల వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రత్యేక అధికారి ఆంధ్రయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాబాయి, కవిత, సుధాకర్, పోసాని, వరలక్ష్మీ, మధ్యాహ్న భోజన వర్కర్‌లు పాల్గొన్నారు.

వైభవంగా మత్తడి పోచమ్మ ఉత్సవాలు

వర్ని, జూలై9: మండలంలోని తగిలేపల్లి గ్రామంలో మంగళవారం మత్తడి పోచమ్మ పండుగ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఇంటికో బోనం చొప్పున మహిళలు పెద్దఎత్తున బోనాలు తీసి ఊరేగింపుగా అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎడ్ల బండ్ల ప్రదర్శన చేసి వన భోజనాలు చేశారు. ఉత్సవాల్లో కమిటీ అధ్యక్షులు గుజ్జ శంకర్, తొంట శంకర్, బక్క రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఇరుగ్రామాల సరిహద్దు సమస్యకు త్వరలో పరిష్కారం

- డివిజనల్ సర్వేయర్ వెంకటేశ్వర్ వెల్లడి

ఎడపల్లి, జూలై9: మండలంలోని కుర్నాపల్లి, ఠాణాకలాన్ గ్రామ శివారు సరిహద్దు సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామని బోధన్ డివిజనల్ సర్వేయర్ వెంకటేశ్వర్ తెలిపారు. కుర్నాపల్లి, ఠాణాకలాన్ గ్రామాలసరిహద్దు వివాదం చాలాకాలంగా పెండింగ్‌లో ఉండడంతో డివిజనల్ సర్వేయర్ వెంకటేశ్వర్ మంగళవారం వివాదాస్పదంగా ఉన్న ఏరియాకు వచ్చి ఇరుగ్రామాల రైతులు, గ్రామస్థులతో కలిసి సరిహద్దుకు సంబందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరిహద్దుకు సంబంధించిన వివరాలు జిల్లా కార్యాలయంలో అందుబాటులో లేక జాప్యం ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంటమండల సర్వేయర్ రమేష్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు రవీందర్‌గౌడ్, ఇరు గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

'కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి'



ధర్నా చేస్తున్న బీఎల్‌టీయూ నాయకులు

సుభాష్‌నగర్, జూలై9: మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు డిమాండ్‌చేశారు. జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం నగర పాలక సంస్థ మేనేజర్ జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే కార్మికులకు జీవోనంబర్60 ప్రకారం కనీస వేతనం రూ.19,500 ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కనీస వేతనాలు ఇవ్వకుండా ఇష్టానుసారం వేతనాలు ఇస్తున్నారని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో జీవో60 ప్రకారం వేతనాలు ఇస్తున్నారని అన్నారు. నిజామాబాద్ పాలకవర్గం ప్రజలకు పన్నులు మోపడంపై ఉన్న శ్రద్ధ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో లేదన్నారు. 2016 సంవత్సరంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఇచ్చిన తీర్పును కూడా అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళాసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సబ్బనిలత మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వలేని పక్షంలో ఎలాంటి పోరాటం చేయడానికైనా కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్మికులు చేసే పోరాటానికి బహుజన లెఫ్ట్ మహిళాసంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేకల రాజేందర్, గజ్జెల యాదయ్య, హరీష్, మురళి, సంపత్, శంకర్, శైలం, శంకర్, మహేందర్, నర్సింలు,రాజు, తదితరులు పాల్గొన్నారు.


నగరంలో ర్యాలీగా నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థుల సమస్యలపై
ఏబీవీపీ నిరంతర పోరాటం

- అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణాజి

నిజామాబాద్ అర్బన్, జూలై9: విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తోందని అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణాజి అన్నారు. జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో మహార్యాలీ నిర్వహించారు. అనంతరం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సభకు బాలకృష్ణాజి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. ఏబీవీపీ ఎన్నోరకాల ఉద్యమాలకు నాయకత్వం వహించి విజయం సాధించిందని, నేడు 76వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందని అన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, విద్యార్థుల కోసం పోరాటం, నిరుద్యోగుల కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు చేసిన ఏకైక సంస్థ ఏబీవీపీ అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో జాతీయభావాన్ని పెంపొందించేందుకు ఏబీవీపీ కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నరేష్, విభాగ్ సంఘటన మంత్రి రాజు సాగర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ, విభాగ్ కన్వీనర్ శశిధర్, జిల్లా కన్వీనర్ సునీల్, సురేందర్‌రెడ్డి, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

డొంకేశ్వర్,జూలై9: మండలకేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరాచేసిన దుస్తులను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డొంకేశ్వర్ మండల తహసీల్దార్ వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ క్యాషియర్ కల్లెం గంగారెడ్డ, మధు, పాఠశాల హెచ్‌ఎం సబేరబేగం, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో విద్యార్థులకు టై, బెల్ట్‌ల పంపిణీ

మోర్తాడ్, జూలై9: మండలకేంద్రంలోని ఎస్సీబీసీకాలనీలో పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్థానిక హెచ్‌ఎం, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ప్రవీన్ తన సొంత నిధులతో టై, బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ వరలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బోధన్ వీడీసీ సమావేశంలో పాల్గొన్న కులసంఘాల సభ్యులు

బోధన్‌లో 12న ముడుపు.. 20న ఊర పండుగ

బోధన్‌రూరల్, జూలై9: బోధన్ పట్టణంలో 12న గ్రామ నడిబొడ్డున గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముడుపు వేసి 20న ఊర పండుగ నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు బాగారెడ్డి తెలిపారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఐదు తర్ఫాల కులసంఘాల సభ్యులతో గ్రామ నడిబొడ్డు చావిడి వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులసంఘాలతో మాట్లాడి ఐక్యతతో శుక్రవారం గ్రామముడుపు వేసి, 20న ఊర పండుగ నిర్వహించనున్నట్లు చెప్పారు. ముడుపు వేసిన తర్వాత ప్రజలు బోధన్ ఆచారం ప్రకారం నడుచుకోవాలన్నారు. ఊర పండుగ నిర్వహించడంతో గ్రామదేవతలు శాంతిస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ నాయకులు సూర్యప్రకాష్, గుమ్ముల అశోక్ రెడ్డి, రుద్ర సత్యనారాయణ, కొంద్ర వెంకటి, బీర్కూర్ బుజ్జి, మాసుల శ్రీను, గుంత గంగాధర్, సాయిలుతో ఐదుతర్ఫాల కులసంఘాల నాయకులున్నారు.

'రోడ్లపై కేజీవీల్స్ నడిపితే చర్యలు తప్పవు'

వేల్పూర్, జూలై 9: రోడ్లపై కేజీవీల్ నడపవద్దని, నడిపిన పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరిస్తూ ఎస్సై వినయ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్లపై కేజీవీల్స్ నడిపితే లక్షలాది రూపాయలతో నిర్మించిన రోడ్లు చెడిపోతాయని, ఎవరైనా నడిపితే సమాచారం ఇవ్వాలని కోరారు.

స్కూల్‌లో విద్యార్థినికి విద్యుత్ షాక్

నిజామాబాద్‌రూరల్, జూలై9: జిల్లాకేంద్రంలోని 13వ డివిజన్ పరిధిలోని సారంగపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మంగళవారం ఓ విద్యార్థినికి విద్యుత్ షాక్ తగిలి స్వల్పగాయమైంది. సారంగపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇంటర్‌వెల్ సమయంలో విద్యుత్ మరమ్మతులు జరుగుతున్న గదిలోకి వెళ్లింది. స్విచ్‌వేయడానికి యత్నించడంతో కరెంట్‌షాక్ తగిలి కిందపడటంతో తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంలో చేతివేలికి గాయంకావడంతో విద్యార్థినిని ఆసుపత్రికి తరలించి చికిత్సచేయించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ఇన్‌చార్జి హెచ్‌ఎం లలితను ప్రశ్నించగా తాను ఆ సమయంలో పాఠశాలలో లేనని తెలిపారు.

గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన


ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఇందల్వాయి, జూలై 9: ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గౌరారం, డొంకల్ గ్రామాలలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకొని ప్రజలందరికీ డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్నవారికి రక్త పరీక్షలు చేసి దోమల వల్ల కలిగే వ్యాధులైన మలేరియా, చికున్‌గున్యా, డెంగ్యూ, ఫైలేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోగుల వద్ద నుండి రక్తపరీక్షలు చేసివారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి మందులను అందించారు. ప్రజలు తాగేనీటిని పరిశీలించారు. తాగేనీరు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని నీటి ట్యాంకులను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ కలపాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తీర్ణ అధికారి శంకర్, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మి, మహాలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి కీర్తన, దీపిక, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

నవీపేట: నవీపేట ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్యబృందం ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహెచ్‌ఎస్ బాలుర, బాలికల పాఠశాలలతోపాటు స్కాలర్స్ పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో డయేరియా,మలేరియా, చికున్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని వైద్యాధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కావ్య, హెచ్‌ఈవో వెంకటేశ్వర్ రావు, సూపర్‌వైజర్ కిషన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌లో యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ డాక్టర్ ఫిర్దోస్ ఫాతిమ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, డయేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంత, హెల్త్ అసిస్టెంట్ బట్టు ఆనంద్, హాస్టల్ వార్డెన్ జయశీల, యుపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు
కనీస సౌకర్యాలు కల్పించాలి: ఏఐఎస్ఎఫ్

నిజామాబాద్ అర్బన్, జూలై9: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కనీససౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాకార్యదర్శి రఘురాం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ఇప్పటికీ విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాఠశాలల్లో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యం, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోఆర్డినేటర్ శ్రీనివాస్‌ను కోరారు. కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షురాలు అంజలి, నాయకులు నవీన్, వంశీ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో స్వయం ఉపాధిపై శిక్షణ

డిచ్‌పల్లి, జూలై 9: డిచ్‌పల్లిలో స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమాన్ని ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో డీపీఎం సాయిలు పాల్గొని మాట్లాడారు. వ్యాపార అభివృద్ధి మేళకువలతో ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి సాధ్యమని అన్నారు. ఈ శిక్షణ వ్యాపారంలో అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని, తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణ తీసుకున్న నిరుద్యోగులు జీవితంలో స్థిరపడ్డారని అన్నారు. శిక్షణలో స్కూల్ డ్రెస్ కుట్టడం, కట్టింగ్ నేర్పుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్రీని వాస్, సిబ్బంది భాగ్యలక్ష్మీ, నవీన్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం

జిల్లా బీసీ అభివృద్ధి అధికారినిగా స్రవంతి

నిజామాబాద్ అర్బన్, జూలై9: జిల్లా బీసీ అభివృద్ధి అధికారినిగా స్రవంతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండేళ్లకుపైగా జిల్లాకు పూర్తిస్థాయి బీసీ అభివృద్ధి అధికారి లేకపోవడంతో బీసీ వెల్ఫేర్ అధికారి రమేష్ అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇదివరకు డీడబ్ల్యూవోగా పనిచేసిన స్రవంతి జిల్లాతో అనుబంధం ఉంది. హైదరాబాద్‌లో సీసీఎల్‌లో పనిచేస్తున్న ఆమెను జిల్లా బీసీ అభివృద్ధి అధికారిగా నియమించడంతో ఆమెమంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బీసీ వెల్ఫేర్ ఉద్యోగులు ఆమెకు స్వాగతం పలికారు.

తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఢిల్లీ

నిజామాబాద్ అర్బన్, జూలై9: తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన గడ్డం భక్తవత్సలం (ఢిల్లీ) నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షుడు ప్రతాని రామకృష్ణాగౌడ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. బీసీ కుల అభివృద్ధి, సంక్షేమానికి రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొండ దేవయ్య పటేల్, కొప్పారి భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

స్వర్ణకార సంఘం
రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సుధాకర్ చారి

బోధన్‌రూరల్, జూలై9: స్వర్ణకార సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బోధన్‌కు సుధాకర్ చారి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి నియామకపత్రాన్ని అందజేశారు. స్వర్ణకార సభ్యుల సమస్యలపరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని సుధాకర్ చారి పేర్కొన్నారు. కుల సంఘ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రఉపాధ్యక్షుడు రాజమౌళి, సలహాదారులు బ్రహ్మం, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసచారి, జిల్లా కోశాధికారి అశోక్ చారి, బోధన్ విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షులు ప్రభాకర్, స్వర్ణకారసంఘం అధ్యక్షుడు జనార్ధన్‌చారి, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

ధర్పల్లి, జూలై9: మండలకేంద్రంలోగల మోడల్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేందర్ సాహెబ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో పురోగతి సాధించిన పోలీసులు

నవీపేట,జూలై9: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో 4.10 లక్షల రూపాయల దొంగతనం కేసులో పోలీసులు పురోగతి సాధించారు. సుభాష్ నగర్ కాలనీకి చెందిన సయ్యద్ మీర్ ఈ నెల 6న తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నందిపేట వెళ్లగా ఇంట్లో దొంగతనం జరిగిన విషయం విదితమే. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు కొంత పురోగతి సాధించారు. బాధిత కుటుంబానికి పరిచయం ఉన్న వ్యక్తులే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. దొంగతనానికి సంబంధించిన పలు ఆధారాలను పోలీసులు ఈ పాటికే సేకరించారు. ఒకటి, రెండు రోజుల్లో నిందితులను పోలీసులు పట్టుకోనున్నట్లు తెలుస్తోంది.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

రుద్రూరు, జూలై 9: మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న జై భవానీ స్వీట్ షాప్‌లో కైలాష్ (19) పని చేస్తున్నాడు. తన కుటుంబ ఆర్థికపరిస్థితి బాగాలేక రాజస్థాన్ నుంచి జీవనోపాధి కోసం రుద్రూరుకు వచ్చి పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ మధ్యే అతనికి నిశ్చితార్థం జరిగి రద్దు కావడంతో అదే విషయాన్ని మనసులో పెట్టుకుని తన ఇంటి గురించి ఆలోచిస్తూ మనస్థాపం చెంది సోమవారం రాత్రి స్వీట్ షాప్ వెనుక ఉన్న రూమ్‌లో ఉరి వేసుకుని మృతి చెందాడు. స్వీట్ షాప్ యజమాని శుక్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.265	రూ. 285





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,000	రూ.67,300	రూ.935

సినిమా గైడ్ నిజామాబాద్



పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : కల్కి (3డి తెలుగు) (11.00, 2.45, 6.30, 10.15)
- స్క్రీన్-2 : డిస్పికేబుల్ మి-4 (తెలుగు 3డి) (11.40, 2.00, 4.20, 6.40)
  : డిస్పికేబుల్ మి-4 (ఇంగ్లీష్ 3డి) (9.00)
- స్క్రీన్-3 : ఎంఎస్ ధోని (హిందీ) (11.30, 3.15, 7.00, 10.45)
- స్క్రీన్-4 : కిల్ (హిందీ) (12.30, 3.00, 5.30, 8.00, 10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : కల్కి (తెలుగు) (1.30, 6.50, 10.30)
- స్క్రీన్-2 : కల్కి (తెలుగు) (10.45, 3.45)
  : కల్కి (3డి తెలుగు) (7.15, 10.40)

- దేవి : మహారాజ (11.15, 2.15, 6.15, 9.15)
- నటరాజ్ : కల్కి (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్